క్లుప్తంగా

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు అందజేత

చింతాయపాలెం(కర్లపాలెం): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనందించటం అభినందనీయమని ఎంఈఓ విజయశ్రీ తెలిపారు. బుధవారం చింతాయపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు హెచ్ఎం టి.ఉషాకిరణ్ ఆధ్వర్యంలో ఎంఈఓ విజయశ్రీ చేతుల మీదుగా భోజనం చేసే స్టీల్ ప్లేట్లు అందజేశారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు రామారావు, ఆదినారాయణ, ఉపాధ్యాయులు నాగమురళి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

కర్లపాలెం: డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని బాపట్ల ఏరియా కో–ఆర్డినేటర్, డీపీఎం ఉసురపాటి సుబ్బారావు చెప్పారు. మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏరియా కో–ఆర్డినేటర్ సుబ్బారావు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం డ్వాక్రా గ్రూపుల ద్వారా పలురకాల రుణాలను మంజూరు చేస్తుందని చెప్పారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని చెప్పారు. అధికమొత్తంలో రుణాలు తీసుకున్న మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలన్నారు. ఏపీఎం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళను లక్షాధికారిని చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అమరావతికి నిధుల కేటాయింపు చరిత్రాత్మకం

బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్



బాపట్ల: అమరావతి నిర్మాణనికి రూ.15వేలు నిధులు కేటాయించడం చరిత్రాత్మకమని, గొప్ప రాజధానిని తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి కేంద్ర బడ్జెట్ సమావేశంలోనే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక స్థానం కల్పించిందని చెప్పారు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు మంజూరు చేయడంతో పాటు, రాష్ట్రానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని పార్లమెంట్ సాక్షిగా ప్రకటించారన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశంలో అన్ని నగరాలను, అన్నిరాష్ట్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి చేస్తారన్నారు. బీజేపీ నాయకులు బాబు నాగేంద్ర, బొడ్డు కృష్ణ చైతన్య, కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు, నాసిన మణికుమార్, మణియాదవ్ పాల్గొన్నారు.

రథ నిర్మాణ పనుల పరిశీలన

బాపట్ల: భావదేవుని రథం పనులను త్వరితగతిన పూర్తిచేసి స్వామివారి దేవస్థానం వద్ద అందుబాటులో ఉంచాలని రథం పనుల నిర్మాణ కాంట్రాక్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ కోరారు. పట్టణంలోని తూర్పు సత్రం స్థలంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ రాజ్యలక్ష్మీ సమేత క్షీర భావన్నారాయణ స్వామివారి రథం పనులను బుధవారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ రూ.కోటి వ్యయంతో భావదేవుని రథం నిర్మించాలని ప్రతిపాదనలు చేయగా రూ.85 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, మరో రూ.15 లక్షలు తాను విరాళంగా అందజేసినట్లు పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బాబు నాగేంద్ర, కోట్ర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు సరఫరా చేయాలి

తెనాలి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు వ్యవసాయశాఖ వరి విత్తనాలను సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లును కోరారు. వర్షపునీరు నిలిచిన పంట చేల పరిశీలనకు బుధవారం తెనాలి రూరల్ మండలంలో పర్యటించిన జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లును రైతుసంఘం నేతలు, వివిధ గ్రామాల రైతులు కలిశారు. వరి విత్తనాలను 90 శాతం సబ్సిడీతో సరఫరా చేయాలని కోరగా, అయిదు శాతం రాయితీతో కూడిన విత్తనాలను మాత్రమే అందించగలమని వెంకటేశ్వర్లు చెప్పారు. కొద్దిగా సొంతపొలం ఉండి కౌలుకు చేసుకుంటున్న రైతుల వివరాలను సేకరించాలనీ, జేఎల్‌జీ గ్రూపులు ఏర్పాటుచేయాలని, ప్రతి వ్యవసాయశాఖ, ఆర్‌బీకే ఉద్యోగులు కనీసం 10 గ్రూపులు ఏర్పాటుచేసి, బ్యాంకర్ల నుండి రుణాలను ఇప్పించాలని కోరారు. వీరితో రైతులు వేజెండ్ల రోశయ్య, మహబూబ్‌ఖాన్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కూల్చారు.. రోడ్డున పడేశారు

- కల్యాణ మండపం నిర్మాణం పేరుతో ఇళ్లు కూల దోశారు
- వైఎస్సార్ సీపీ సానుభూతి పరులే లక్ష్యంగా టీడీపీ కూల్చివేతల పర్వం
- చింతమోటులో నిలువనీడ కోల్పోయిన బాధితులు
- నిస్సహాయ స్థితిలో బాధితులు
- కొందరికి నోటీసులు కూడా ఇవ్వకుండా కూలదోసిన వైనం



చింతమోటులో కూలదోసిన ఒంటినిట్టాడు ఇంటివద్ద సాంబశివరావు కుటుంబం

చింతమోటు(భట్టిప్రోలు): తరతరాలుగా పోరంబోకు భూముల్లో స్థిర నివాసాలు, పశువుల చావిడులు ఏర్పాటు చేసుకుని ఉంటున్నవారి ఇళ్లను కల్యాణ మండపం నిర్మాణం సాకుతో కూల్చివేయడంపై చింతమోటు గౌడ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భట్టిప్రోలు మండలం చింతమోటు గౌడ కాలనీలో దాదాపు 50 మందికి పైగా పోరంబోకు భూముల్లో వీటిని ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఆక్రమణల పేరుతో కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను టార్గెట్ చేస్తూ బరి తెగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన శౌంఠి జయకృష్ణకు చెందిన పశువుల చావిడి, శౌంఠి సాంబశివరావు, ఉయ్యూరు విజయలక్ష్మిలకు చెందిన ఒంటినిట్టాడు పూరిపాకలు, వాకా రాజ్యలక్ష్మికి చెందిన పాకను పంచాయతీ అధికారులు దగ్గర ఉండి పోలీసుల సమక్షంలో తొలగించారు. వీరిలో ఇరువురికి పంచాయతీ అధికారులు నోటీసులు ఇవ్వగా మిగిలిన వారికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూలదోశారు. దీంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో ఆయా కుటుంబాలు ఉన్నాయి. నిలువ నీడ కోల్పోవడంతో ఆ కుటుంబాలు వీధిన పడ్డాయి.



కూలదోసిన పూరిపాక, పశువుల చావిడి ప్రాంతం

బడ్డీ తొలగింపునకు నోటీసు ఇచ్చి నిట్టాడిల్లును కూల దోశారు

నా తండ్రి కాలం నుంచి ఇక్కడ ఉంటున్నాను. చిన్నపాటి బడ్డీకొట్టు పెట్టుకుని జీవిస్తున్నాను. ఒక నిట్టాడు ఇంటిలో అనారోగ్యంతో బాధపడుతూ నా తల్లి ఉంటుండగా మరో పూరింట్లో నా కొడుకు, నా కుమార్తె కుటుంబాలు ఉంటున్నాయి. బడ్డీకొట్టు తొలగించమని నోటీసులు ఇచ్చి నిట్టాడిల్లును కూల దోశారు.

– శౌంఠి సాంబశివరావు, బాధితుడు

రాత్రంతా రోడ్డుపైనే జాగారం..



ఇంటికి మగ దిక్కు లేకపోవడంతో ఇరువురు పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూ ఉన్న కొద్దిపాటి పూరిపాకలో జీవిస్తున్నాను. పొక్లెయినర్‌తో పాకాను కూలదోసి వాసాలు, తాటాకులు, సామగ్రిని పక్కన పడవేశారు. రాత్రంత్రా రోడ్డు పైనే పిల్లలతో జాగారం చేశాను. ఉన్న కొద్దిపాటి నీడ లేకపోవడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

– వాకా రాజ్యలక్ష్మి, బాధితురాలు

కక్ష పూరితంగా కూలదోశారు



టీడీపీ నాయకులు కావాలనే కక్షపూరితంగా మా ఇళ్లను, చావిళ్లను కూలదోశారు. గ్రామంలో గతంలో ఎన్నడూ లేని సంస్కృతికి టీడీపీ శ్రేణులు పూనుకోవడం బాధాకరం. గ్రామంలో ఎన్నోఏళ్లుగా నెలకొన్న స్మశాన వాటిక సమస్యను పట్టించుకోకుండా వ్యక్తిగత కక్షలతో ఇలా చేయడం ఎంత వరకు సబబు?

– శౌంఠి జయకృష్ణ, బాధితుడు

'జాబ్ కార్డులున్న అందరికీ వందరోజులు పని'

- డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.రాజేష్
- భట్టిప్రోలులో ప్రజా వేదిక
- రూ.6.96 కోట్లతో 1404 పనులు నిర్వహణ



ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ ఎస్.రాజేష్, పక్కన ప్రజా ప్రతినిధులు, అధికారులు

భట్టిప్రోలు: చట్టబద్ధమైన కనీస వేతనంతో గ్రామీణ ప్రాంతాల్లోని వయోజనులకు పని కల్పించడమే ఎన్ఆర్ఈజీఎస్ పథకం ముఖ్య ఉద్దేశమని జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.రాజేష్ తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో (ఎన్ఆర్ఈజీఎస్) గత ఏడాది జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలని.. ముఖ్యంగా ఎస్టీలకు ఈ అవకాశం దక్కేలా చూడాలని కోరారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 1404 పనులకు సంబంధించి రూ.6.96 కోట్లు పనులు జరగ్గా సామాజిక తనిఖీ నిర్వహించారు. అయితే మస్టర్‌లో చిన్న చిన్న తప్పులు దొర్లడం, కొట్టివేతలు ఉండటాన్ని అధికారులు గుర్తించి ఇక ముందు అలా జరగకుండా చూడాలని కోరారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, ఏపీడీ సువార్తమ్మ, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ హెచ్ఆర్ మేనేజర్ చంద్రశేఖర్, జేఈ జయ చంద్రకుమార్, ఎంపీడీఓ జేబీవీ మల్లిఖార్జునరరావు, ఏపీఓ శివ పార్వతి, టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్ కుమార్, ఎస్సార్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో చోరీలకు పాల్పడుతున్న బాలిక

పోలీసులకు అప్పగించిన భద్రతా సిబ్బంది

తెనాలిరూరల్: జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఓ బాలిక చోరీలకు పాల్పడుతోంది. బాలికను గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది ఆమెను పట్టుకుని పోలీసులకు బుధవారం అప్పగించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో గత కొంత కాలంగా చోరీలు జరుగుతున్నాయి. రోగులు, రోగుల సహాయకులకు చెందిన నగదు, నగలు, హ్యాండ్‌బ్యాగులు మాయమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వైద్యశాలలో రక్త నమూనాలు సేకరించే మహిళ బ్యాగులో ఉన్న నల్లపూసల దండ మాయమైంది. చోరీల విషయం తెలుసుకున్న వైద్యశాల సూపరింటెండెంట్, అధికారులు వైద్యశాలలో ప్రైవేటు ఏజెన్సీ కింద ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రక్తనమూనాలు సేకరించే మహిళ బ్యాగు ఉన్న ప్రదేశానికి సమీపంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించగా ఓ బాలిక గొలుసు అపహరించినట్లు గుర్తించారు. వైద్యశాలలో ఉన్న రోగులకు సహాయకురాలిగా వైద్యశాలలో సంచరిస్తూ అందినకాడికి దోచుకుంటోందని సెక్యూరిటీ సిబ్బంది తెలుసుకున్నారు. వైద్యశాల ఓపీ విభాగం వద్ద బుధవారం ఉదయం సదరు బాలిక సంచరిస్తుండగా గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ఆమెను పట్టుకుని త్రీ టౌన్ పోలీసులకు అప్పగించారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన బాలిక, కుటుంబసభ్యులు కొంతకాలంగా తెనాలిలో నివసిస్తున్నారని, వైద్యశాలలో చోరీలకు అలవాటు పడిందని పోలీసు వర్గాలు తెలిపాయి. వైద్యశాలలో అపహరించిన నల్లపూసల దండను కడపలో ఓ మహిళ వద్ద ఉంచానని బాలిక పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. బాలిక ఒక్కతే చోరీలకు పాల్పడుతోందా? లేక ఆమెతో పాటు మరింత మంది వైద్యశాలకు వచ్చి చోరీలు చేస్తున్నారా అన్న అంశాలను పరిశీలిస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

పోస్టాఫీసు పథకాలపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్‌బాబు, సిబ్బంది

నిజాంపట్నం: పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లోని పాలసీలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్ బాబు తెలిపారు. మండలంలోని కూచినపూడి గ్రామంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం డాక్ చౌపల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కరుణాకర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని పోస్టాఫీసులోని పొదుపు ఖాతాలు, సుకన్య సమృద్ధి యోజన, ఐపీపీబీ, గ్రూపు యాక్సిడెంట్ ఇన్స్యూరెన్స్ పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా స్థానిక సాయి విద్యానికేతన్‌లో విద్యార్థులకు పోస్టల్ కార్డ్స్, స్టాంప్స్ గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి పోస్టాఫీసు పథకం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. రేపల్లె ఏఎస్పీ ఏడుకొండలు, తెనాలి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, ఎంఈ పవన్, డీఓపీఎల్ఐ సత్యన్నారాయణ, ఎంఓలు నరేంద్ర, కిరణ్, ఐపీపీబీ మేనేజర్‌లు ప్రశాంతి, వెంకటరెడ్డి, హెచ్ఎంలు నరేంద్ర ప్రసాద్, కోటేశ్వర రావు, పశువైద్యాధికారి హేమప్రియ తదితరులు పాల్గొన్నారు.

'పరిష్కార వేదిక'కు అధికారుల డుమ్మా

పిట్టలవానిపాలెం: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని మండల కేంద్రంలో ఏర్పాటు చేసి మండలస్థాయి అధికారులందరూ పాల్గొని సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడం, వచ్చిన వారు కూడా తమకు ఇష్టమొచ్చినప్పుడు రావడం, వెళ్లడంతో ఉన్నతాధికారుల లక్ష్యం నీరుగారుతోందనే విమర్శలున్నాయి. సోమవారం నిర్వహించిన మీకోసంకు తహసీల్దార్ చిన్నం సుధారాణి, నీటిపారుదల శాఖనుంచి క్షేత్రస్థాయి అధికారి మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖలకు చెందిన అధికారులు హాజరు కాక పోవడం గమనార్హం. ఇదేవిధంగా ప్రతి సోమవారం గ్రీవెన్స్‌డేను మమ అనిపిస్తున్నారు. ఈవిషయంపై అధికారులు స్పందిస్తూ అల్లూరు, జీఎస్‌పాలెం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించామని అక్కడకు వెళ్లాల్సి రావడంతో మీకోసంకు రాలేకపోయామని వచ్చినా సంతకాలు చేసి వెళ్లడం జరిగిందని చెబుతున్నారు. అయితే కలెక్టర్ ఆదేశాలు మాత్రం సోమవారం ఎన్ని ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నా మీకోసం నిర్వహించాల్సిందేనని స్పష్టం చేస్తున్నాయి. అధికారుల తీరు చూస్తే కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నట్లు అనిపిస్తుంది.

టీచ్‌టూల్ శిక్షణతో మెరుగైన ఫలితాలు

డీఈఓ శైలజ



మాట్లాడుతున్న డీఈఓ శైలజ

తెనాలిఅర్బన్: టీచ్ టూల్ శిక్షణతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారిణీ శైలజ పేర్కొన్నారు. తెనాలిలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీచ్ టూల్ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. అనంతరం కొత్తపేటలోని రావిసాంబయ్య మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న క్రీడ ఉత్సవాలను ఆమె పరిశీలించారు. క్రీడల పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట మండల విద్యాధికారులు మేకల లక్ష్మీ నారాయణ, వి.జయంతి బాబు, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించండి

మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల



మాట్లాడుతున్న మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల

తెనాలిఅర్బన్: వ్యాధుల పట్ల ప్రజలందరికీ అవగాహన కల్పించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, స్పెషల్ ఆఫీసర్ అంగలకుదురు గాయత్రిదేవిలు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలోని హెల్త్ సెక్షన్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అలాగే దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ఎవ్వైన వ్యాధి సంభవించిన వెంటనే వైద్యశాలకు వారిని పంపే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్ పుష్పలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, శానిటేషన్ సెక్రెటరీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

బాపట్లటౌన్: భర్త వేధింపులపై ఓ మహిళ బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.మండలంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన మానికల దుర్గాదేవికి 20 సంవత్సరాల క్రితం అంకమ్మరావుతో వివాహం జరిగింది. ఆమెకు ఇద్దరు పిల్లలు న్నారు. భర్త నిత్యం మద్యం సేవించి మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదుచేసింది. బాధితురాలి ఫిర్యాదుమేరకు రూరల్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రహదారిద్ర్యం!

- అధ్వానంగా రోడ్లు
- భారీ గుంతలతో ప్రయాణికుల అవస్థలు
- మరమ్మతులతో ప్రయోజనం శూన్యం
- నూతన రహదారుల నిర్మాణంతోనే మేలు



ఆవులవారిపాలెంలోని గాజుల్లంక సొసైటీ బ్యాంక్ వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు



గతుకులమయంగా రావికంపాడు రోడ్డు

కొల్లూరు: అడుగుకో గుంత.. కాలు కదిపితే మొనదేలి గుచ్చుకునే గులకరాళ్లు.. మడుగులను తలపించేలా నిలిచిన నీళ్లతో అస్తవ్యస్తంగా తయారైన రోడ్లపై ప్రయాణం ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. రవాణా వ్యవస్థలో ప్రధానమైన రహదారులు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు, వ్యవసాయోత్పత్తులు తరలించుకోవడానికి రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం

200 కి.మీ మేర అధ్వానం..

వేమూరు నియోజకవర్గం పరిధిలోని 5 మండలాల్లోని రహదారుల పరిస్థితి తీసికట్టుగా మారడంతో నిత్యం ఆయా మార్గాలలో ప్రయాణం కొనసాగించే వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, అమృతలూరు, చుండూరు మండలాల్లో 200.84 కిలోమీటర్ల మేర రోడ్లు ప్రయాణానికి పనికిరానివిధంగా మారడంతో రోడ్లనిర్మాణాలు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రయాణ కష్టాల నుంచి గట్టెక్కించాలని అధికారులను ప్రజలు వేడుకొంటున్నారు.

మృత్యుమార్గంగా లంకల రోడ్డు..

మోకాలు లోతు గుంతలు, అగాధాలను తలపిస్తున్న కొల్లూరు మండలంలోని లంక గ్రామాలకు చేరుకునే ఏకైక రోడ్డు మృత్యుమార్గంను తలపించేలా తయారవడంతో ప్రయాణికులు ఈదారిలో ప్రమాదాల బారిన పడటం నిత్యకృత్యంగా మారింది. 12 లంక గ్రామాలలోని సుమారు 14 వేలమంది ప్రజల రాకపోకలకు వినియోగించుకునే రహదారి కొల్లూరు కరకట్ట దిగువ నుంచి పెసర్లంక అరవింద వారధి వరకు సుమారు 3 కిలోమీటర్లు పైగా పూర్తిగా దెబ్బతినడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రజలు ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించింది. ఈమార్గం మొత్తం భారీ అగాధాలతో నిండి ఉండటంతోపాటు, ద్విచక్ర వాహనదారులు వాహనం ఎదురైతే రోడ్డు కిందకు దిగే అవకాశం సైతం లేకపోవడంతో ఏసమయంలో ఎవరి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయోన్న భయాందోళన నడుమ రాకపోకలు సాగిస్తున్నారు. సుమారు 3 వేల మంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడానికి సైతం ఈమార్గంలోనే ప్రయాణించాల్సి ఉండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలు ఇళ్లకు చేరేవరకు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుండటం రహదారి దుస్థితికి అద్దం పడుతుంది. భారీ గుంతలతో నిండిపోయిన రోడ్డులో ప్రమాదాలకు గురవతుండటంతోపాటు, వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. మండలంలోని రావికంపాడు, గాజుల్లంక, పోతార్లంక రోడ్లు ధ్వంసమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

కొత్త రోడ్లతోనే మోక్షం

చిద్రమైన రోడ్లకు మరమ్మతులు చేపడితేనే ప్రయాణికుల కష్టాలు కడతేరే అవకాశం ఉంది. భారీ గుంతలతో చెరువుల్లా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టడం వల్ల నిధులు వృధా మినహా, రోడ్డు పరిస్థితి తిరిగి యథాస్థితికి చేరుకొని ప్రయాణం కష్టతరమవుతుందని పలు గ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో రహదారుల అంచుల వరకు చేపట్టిన ఆక్రమణలు, ప్రభుత్వ స్థలంలో రోడ్ల కంటే ఎత్తుగా పోసిన మెరకలను తొలగించి, రోడ్లపై నీరు నిల్వకుండా పగడ్బందీ చర్యలు చేపట్టి నూతన రహదారుల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు



వర్షాలు, ఇతర కారణాలతో ఇప్పటివరకు దెబ్బతిన్న రహదారుల పరిస్థితిని గమనించి ప్రభుత్వానికి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాము. ప్రభుత్వం రహదారుల మరమ్మతుల కోసం నిధులు విడుదల చేసిన వెంటనే పనులు చేపడతాం.

– ఎం.నరసింహారావు, ఆర్అండ్‌బీ ఏఈ, కొల్లూరు

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొల్లూరు: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యు యంత్రాంగం స్వాధీనం చేసుకొని కొల్లూరు పోలీసులకు అప్పగించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెసర్లంక అరవింద వారధి సమీపం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా, కొల్లూరు డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్ పెసర్లంకలో ట్రాక్టర్‌ను నిలువరించి స్టేషన్‌కు తరలించారు. అనంతరం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి తహసీల్దార్ పుల్లారావుకు బదిలీ చేశారు.

అన్నా క్యాంటీన్ మరమ్మతులు వేగవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లను వెంటనే మరమ్మతు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో, మున్సిపల్ కార్యాలయం ఎదుట, బస్టాండ్ వెనుక ఉన్న అన్నా క్యాంటీన్ భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, పలువురు ఏఈలు ఉన్నారు.

ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభం

రిజర్వేషన్ మంగళగిరి. .బస్సు విజయవాడలో..

మంగళగిరి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆన్‌లైన్ రిజర్వేషన్ కౌంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం నాయక్ మాట్లాడుతూ కరోనా సమయంలో నిలిపివేసిన కౌంటర్‌ను తిరిగి ప్రారంభించినట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు రిజర్వేషన్ కౌంటర్ పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం, బెంగళూరు నగరాలతో పాటు రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని వివరించారు. ప్రయాణికులంతా రిజర్వేషన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. అయితే రిజర్వేషన్ కౌంటర్ ఇక్కడ అయినప్పటికీ బస్సు మాత్రం విజయవాడ బస్టాండ్‌లో ఎక్కాలని అధికారులు సూచించడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

నరసాపురం ఎంపీడీఓ మృతిపై విచారణ జరపాలి



కొల్లూరు: నరసాపురం ఎంపీడీఓ మృతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కొల్లూరు మండల పరిషత్ సిబ్బంది డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఎంపీడీఓ అదృశ్యమై, మృతదేహం లభ్యమవడం దురదృష్టకరమని, ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఎంపీడీఓ లక్ష్మీకుమారి పేర్కొన్నారు. అనంతరం సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.